సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 29 । నవంబర్ । 2024



బొగ్గు ఉత్పత్తికి సహకరించాలి

బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంపునకు గుర్తింపు, ఇతర కార్మిక సంఘాలు సహకరించాలని సింగరేణి డైరెక్టర్లు కోరారు. 8లో



రుణమాఫీపై రైతుల్లో ఆశలు

ఇప్పటివరకు రుణమాఫీ కాని అర్హులైన రైతులకు ఈనెల 30న నగదు విడుదల చేస్తామనే ప్రకటనతో ఆశలు చిగురిస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 21°

వాతావరణం

జిల్లాలోని పలుచోట్ల శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, హారతి, మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో మూడు నెలల నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. జనరల్ డ్యూటీ, హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 18 – 29 సంవత్సరాల మధ్య వయసు ఉండి, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని వివరించారు.

మెనూ అమలుపై ఆరా..



విద్యార్థులతో క్రీడా శాఖ అధికారులు

పాల్వంచరూరల్ : కిన్నెరసాని క్రీడా పాఠశాలకు అందించే మెనూ ఎలా ఉంటోందని మహబూబాబాద్, ములుగు జిల్లాల క్రీడా శాఖాధికారులు వై.ఆదినారాయణ, సీహెచ్.కొమ్మాలు ఆరా తీశారు. కిన్నెరసాని ఆశ్రమ పాఠశాలను గురువారం వారు పరిశీలించారు. ఏరోజు ఏ ఆహార పదార్థాలు పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వివిధ క్రీడాంశాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎలాంటి శిక్షణ ఇస్తున్నారని పరిశీలించారు. వారి వెంట ఏఎస్‌ఓలు ఎస్.వెంకన్న, పద్మజ, లక్ష్మీనారాయణ, జిల్లా స్పోర్ట్స్ అధికారి గోపాల్, ఏటీడీఓ చంద్రమోహన్, పీడీ బాలసుబ్రహ్మణ్యం, పీఈటీ దొడ్డి అంజయ్య, కోచ్‌లు వాసు, ప్రసాద్, సందీప్, మండల్ సునీల్ ఉన్నారు.

ఆర్టీసీ సెక్యూరిటీ అధికారుల అలర్ట్

సాక్షి ఎఫెక్ట్..

చుంచుపల్లి: ఆర్టీసీ అద్దె బస్సులతో ప్రమాదాలు పెరుగుతున్నాయని, దీనికి డ్రైవర్ల నిర్లక్ష్యంతో పాటు మద్యం మత్తు ఓ కారణమంటూ మంగళవారం 'హైర్‌తో అనర్థాలు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి సెక్యూరిటీ విభాగం అధికారులు స్పందించారు. గురువారం అన్ని డిపోల పరిధిలో డ్రైవర్లకు విస్తృతంగా బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించడమే కాక పర్యవేక్షణ మరింతగా పెంచారు. బస్సుల పనితీరును సైతం పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే బయటకు పంపేందుకు అనుమతి ఇస్తున్నారు.

జలం.. కాలుష్యం





మురుగుమయమైన ఇల్లెందులోని బుగ్గవాగు (ఇన్‌సెట్) కొత్తగూడెం గోధుమవాగు వెంట మున్సిపల్ సిబ్బంది పడేసిన చెత్త

జిల్లాలోని పట్టణాల పరిధిలో ఉన్న జలవనరులు కలుషితం అవుతున్నాయి. పట్టణాల నుంచి నిత్యం వెలువడుతున్న చెత్త, మురుగు నీటి కారణంగా ఈ దుస్థితి తలెత్తింది. అయితే హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించినట్టుగానే కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, భద్రాచలంలో ఉన్న జలవనరులను కాలుష్యపు కోరల నుంచి కాపాడాలని జిల్లా వాసులు కోరుతున్నారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పట్టణాల మధ్య నుంచి ప్రవహిస్తున్న వాగులు

- చెత్తాచెదారంతో మురికి కూపాలుగా జలవనరులు
- నేరుగా గోదావరిలో కలుస్తున్న భద్రాచలం మురుగు
- ఇక్కడా మూసీ తరహా ప్రక్షాళన చేపట్టాలనే డిమాండ్

జిల్లా కేంద్రంలో..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం మధ్య నుంచి ముర్రేడు, గోధుమ వాగులు ప్రవహిస్తున్నాయి. పట్టణాన్ని అనుకుంటూ మరికొన్ని జల ప్రవాహాలు ఉన్నాయి. అయితే మున్సిపాలిటీలోని 36 వార్డులతో పాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో విస్తరించిన పట్టణ ప్రాంతంలో లక్షకు పైగా జనాభా నివసిస్తోంది. వీరంతా ఉపయోగించిన మురుగునీరు నేరుగా ముర్రేడు, గోధుమ వాగుల్లో కలుస్తుండడంతో ఇవి మురికి కూపాలుగా మారుతున్నాయి. మరోవైపు మున్సిపల్, పంచాయతీల నిర్లక్ష్యంతో పట్టణం నుంచి వెలువడిచ చెత్తను సైతం ఈ వాగుల సమీపంలోనే ఇష్టారీతిగా పడేస్తున్నారు. దీంతో ఈ రెండు వాగులు అందాన్ని కోల్పోయి మురుగు కాల్వలుగా దర్శనమిస్తున్నాయి. ఇసుక మాఫియా కారణంగా వీటి పరిస్థితి మరింత దైన్యంగా మారింది.

ఇల్లెందులో బుగ్గవాగు..

ఇల్లెందు పట్టణం మధ్య గుండా బుగ్గవాగు ప్రవహిస్తోంది. కొన్ని దశాబ్దాల నిర్లక్ష్యం ఫలితంగా వాగు లక్షణాలు కోల్పోయి పెద్ద మురికి కాలువలా ఈ జలప్రవాహం మారింది. అయితే గత నాలుగేళ్లుగా ఈ వాగులో జంగిల్ క్లియరెన్స్, చెత్త తొలగింపు పనులు చేపట్టడంతో తిరిగి వాగుగా మారింది. పట్టణ పరిధిలో 24 వార్డులు ఉండగా ఇందులో 20 వార్డుల్లో వెలువడిన మురుగు నేరుగా బుగ్గవాగులోనే కలుస్తోంది. కొందరు వ్యాపారులు తమ దగ్గర వెలువడిన చెత్తను ఇందులోనే కలిపేస్తుండడంతో పరిస్థితి మరింతగా దిగజారింది.

పవిత్ర గోదావరిలోనూ అంతే..

భద్రాచలం పట్టణం నుంచి వెలువడే మురుగునీరు నేరుగా గోదావరిలో కలుస్తోంది. ఎక్కడెక్కడి నుంచో ఆర్తిగా భద్రాచలం వచ్చే భక్తులు పవిత్ర గోదావరిలో స్నానమాచరించే స్థలానికి ఎగువన ఈ మురుగు నీరు నదిలో కలుస్తోంది. ఏళ్ల తరబడి ఈ దారుణం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

మణుగూరు.. అదే తీరు..

పారిశ్రామిక ప్రాంతంగా దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరులో కాలుష్యం కూడా రోజురోజుకూ పెరుగుతోంది. వర్షపు నీటితో పాటు ఇళ్ల నుంచి వెలువడే ముగురునీరు పట్టణం మధ్య నుంచి ప్రవహిస్తున్న రెండు కాల్వల గుండా దిగువకు వెళ్తోంది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఈ వాగులు పొంగడం వల్లే మణుగూరు పట్టణం మునిగింది. ఈ మురుగు నీరు నేరుగా దిగువన ఉన్న గోదావరిలోకి వెళ్తోంది. మరో పారిశ్రామిక పట్టణమైన పాల్వంచలోనూ ఇదే తరహా పరిస్థితులు ఉన్నాయి.

సీఎస్సార్ నిధులతో..

సింగరేణి గనుల ప్రారంభానికి ముందు భద్రాద్రి జిల్లా విస్తరించిన ప్రాంతమంతా దట్టమైన అడవి. సింగరేణి గనుల తర్వాత థర్మల్ పవర్ ప్లాంట్లు, ఐటీసీ పేపర్ బోర్డు, హెవీ వాటర్ ప్లాంట్, నవభారత్ తదితర దిగ్గజ పరిశ్రమలు వచ్చాయి. దానికి తగ్గట్టే పట్టణాలూ పెరిగాయి. కార్పొరేట్ సంస్థలు ప్రతీ ఏడాది సామాజిక బాధ్యతగా కేటాయించే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) నిధులను స్థానికంగా ఉన్న జలవనరుల సంరక్షణకు ఉపయోగించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో సీఎస్సార్ నిధులు నిర్వీర్యం అవుతున్నాయని బుధవారం మంత్రి పొంగులేటి స్వయంగా చెప్పడం గమనార్హం.

మూసీ తరహాలో

హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనలో భాగంగా అవసరమైన ప్రతీ చోట మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్సార్ నిధులు ఉపయోగిస్తున్నారు. అదే తరహాలో జిల్లాలో విస్తరించిన పరిశ్రమలు కేటాయించే సీఎస్సార్ నిధులతో ప్రధాన పట్టణాల్లో ముగురునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తే జలవనరులు కాలుష్యం బారిన పడకుండా శాశ్వతంగా కాపాడుకునే వీలుంటుంది.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

గురుకుల సిబ్బందికి కలెక్టర్ ఆదేశం



విద్యార్థులకు వడ్డించే కోడిగుడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

సుజాతనగర్ : గురుకుల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన వేపలగడ్డలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యాలయ ప్రాంగణం, వంటగదులు, విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. విద్యాలయం నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని పాఠశాల ప్రిన్సిపాల్ బ్యూలారాణిని అడిగి తెలుసుకున్నారు. తాత్కాలిక భవనంలో గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేశామని, పక్కా గృహం కావాలని కలెక్టర్‌ను కోరగా వారం రోజుల్లో ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పౌష్టికాహారం అందిస్తేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అనంతరం డేగలమడుగులోని మంజీత్ కాటన్ జిన్నింగ్ మిల్లును పరిశీలించి పత్తిలో తేమ శాతం, ధర కొనుగోలు విధానాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఏఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమగ్ర సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఆయన అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసక్తి కలిగిన యువతీ యువకులను డేటా ఎంట్రీ చేయడానికి నియమించుకోవాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని విద్యాసంస్థల కంప్యూటర్ ల్యాబ్‌లను ఉపయోగించుకోవాలన్నారు. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, కరకగూడెం, చర్ల మండలాల్లో డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎంట్రీని అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. చంద్రుగొండ, ములకలపల్లి, ఇల్లెందు మండలాల్లో భూ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని, తమ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై నివేదికలు సమర్పించాలని తహసీల్దార్లకు సూచించారు. కొత్తగూడెం, టేకులపల్లి, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల పరిధిలో ఎమ్మెల్యేల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల స్థాపనకు అనువైన ప్రదేశాలను గుర్తించి నివేదికలు అందజేయాలని కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలను ఆదేశించారు.

బాలికలతో కలిసి కలెక్టర్ భోజనం..



హాస్టల్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెంరూరల్: చుంచుపల్లిలోని ఎస్సీ బాలికల ప్రీ మెట్రిక్ వసతి గృహాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం రాత్రి సందర్శించారు. అక్కడి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వారికి స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలి తీవ్రత అధికంగా ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. బాలికలను ప్రణాళికాయుతంగా చదివించి ఉత్తమ ఫలితాలు రాబాట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమాధికారి అనసూయ, హాస్టల్ వార్డెన్ సునీత, ఏఎస్‌డబ్ల్యూఓ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఉద్యమ చరిత్రను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో శుక్రవారం జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీన్ని విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. దీక్షా దివస్ కార్యక్రమ ఏర్పాట్లను గురువారం రాత్రి పరిశీలించిన ఆయన.. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం మొదట కార్యాలయ ఆవరణలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, ఆ తర్వాత తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ల అలైన్‌మెంట్ మార్చండి

రైల్వే బోర్డు చైర్మన్‌ను కోరిన ఎంపీ రఘురాంరెడ్డి



రైల్వేబోర్డు చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ

ఖమ్మం వన్‌టౌన్: పాలేరు నియోజకవర్గంతో పాటు స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పరిధిలోని భూముల్లో వెళ్లేలా ప్రతిపాదించిన డోర్నకల్ – మిర్యాలగూడ, డోర్నకల్–గద్వాల రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. సారవంతమైన భూములను రైల్వేలైన్‌కు సేకరించనుండడంతో రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఢిల్లీలో రైల్వేబోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌ను కలిసిన ఎంపీ వినతిపత్రం అందజేసి మట్లాడారు. ఖమ్మంలో మూడో రైల్వేలైన్ నిర్మాణం పూర్తికావొస్తుండగా, ఆరు జాతీయ రహదారులతో అనుసంధానం ఉందని తెలిపారు. ఈ నేపథ్యాన కొత్త రైల్వే లైన్‌తో ప్రజలకు నష్టమే తప్ప లాభం ఉండదని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయంగా డోర్నకల్ వయా వెన్నారం, మన్నెగూడెం, మరిపెడ, మోతే మీదుగా లైన్ నిర్మించాలని కోరారు. తద్వారా దూరంతో పాటు భూసేకరణ, నిర్మాణం వ్యయం తగ్గుతుందని తెలిపారు. ఈమేరకు తన వినతితో రైల్వేబోర్డు చైర్మన్ సానుకూలంగా స్పందించారని ఎంపీ ఓ ప్రకటనలో వెల్లడించారు.

పీఎం ఉజ్వల యోజనపై..

ఆదివాసీ, గిరిజనులు వంటగ్యాస్ రీఫిల్లింగ్ కోసం పడుతున్న కష్టాలను పరిష్కరించాలని ఎంపీ రఘురాంరెడ్డి కోరారు. గ్యాస్ కనెక్షన్ల అంశంపై ఆయన గురువారం పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నలకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువులు, పర్యాటక శాఖల సహాయ మంత్రి సురేష్‌గోపి సమాధానమిచ్చారు. 2016 నుంచి ఇప్పటివరకు ఖమ్మంలో 83,176, భద్రాద్రి జిల్లాలో 71,556 మందికి పీఎం ఉజ్వల యోజన ద్వారా గ్యాస్ కనెక్షన్లు జారీ చేయడమే కాక రీఫిల్లింగ్, సబ్సిడీ కొనసాగిస్తున్నామని తెలిపారు. అలాగే, వంటనూనెలపై ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజాపంపిణీ శాఖల సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ సమాధానమిచ్చారు.

బంగారం తాకట్టు రుణాలపై తనిఖీలు!

పాల్వంచరూరల్ : ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాల్లో అక్రమాలు జరిగిన నేపథ్యంలో స్థానిక డీసీసీబీ బ్రాంచ్‌లోనూ అధికారులు బంగారు రుణాలపై తనిఖీలు చేపడుతున్నారు. పాల్వంచ కో ఆపరేటివ్ బ్యాంక్ శాఖలో కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్, టేకులపల్లి శాఖలో పాల్వంచ బ్రాంచ్ మేనేజర్ గురువారం తనిఖీ చేశారు. ఎంతమంది బంగారు ఆభరణాలు తనఖా పెట్టారు, ఎంత రుణం తీసుకున్నారు, ఆ బంగారం నాణ్యమైనదా, నకిలీదా అనే కోణంలో అధికారులు క్షుణంగా తనిఖీ చేస్తున్నారు.

చేపలు సరే.. రొయ్యల మాటేంటి ?

- ఈ ఏడాది పంపిణీకి మంగళం పాడినట్టేనా..
- గత సంవత్సరం 15 చెరువుల్లో 23 లక్షల పిల్లలు విడుదల



మంచినీటి రొయ్యలు

పాల్వంచరూరల్: చెరువుల్లో రొయ్య పిల్లల పంపిణీకి ఈ ఏడాది ప్రభుత్వం మంగళం పాడినట్టేనా అని మత్స్యకారులు నిరుత్సాహపడుతున్నారు. చేప పిల్లలను సరఫరా చేసిన అధికారులు.. రొయ్యల పంపిణీపై ఎలాంటి ప్రకటనా చేయడం లేదు. గత సంవత్సరం చేప పిల్లలతో పాటే రొయ్యలు కూడా విడుదల చేయగా.. ఈ ఏడాది వాటి ఊసే లేకపోవడంతో సొసైటీ సభ్యులకు నిరీక్షణ తప్పడం లేదు.

గతేదాది 23 లక్షల పిల్లలు..

మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టిని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతీ సంవత్సరం చేప, రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఆయా చెరువుల పరిధిలోని మత్స్యకారులు సొసైటీగా ఏర్పడి చేపల పెంపకం చేపడుతున్నారు. మంచినీటి చెరువుల్లో రొయ్యలను సైతం పెంచేవారు. గతేడాది సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం, బూర్గంపాడు మండలం నకిరేపేటతో పాటు అశ్వారావుపేట, ములకలపల్లి, ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు, చర్ల, అశ్వాపురం, చంద్రుగొండ, మణుగూరు మండలాల పరిధిలోని 15 చెరువుల్లో 23 లక్షల రొయ్య పిల్లలను పంపిణీచేశారు. ఆయా చెరువుల్లో రొయ్య పిల్లలు బాగానే పెరిగినప్పటికీ.. జిల్లాలో చేపల పెంపునకు గల అనువైన వాతావరణం రొయ్యల ఉత్పత్తికి లేదని మత్స్యశాఖ అధికారులు అంటుండడం గమనార్హం. గత సంవత్సరం రొయ్యల పెంపకం ఆశాజనకంగానే ఉందని, ఈ ఏడాది కూడా రొయ్య పిల్లలు పంపిణీ చేయాలని, తద్వారా తమ ఆర్థికాభివృద్ధికి దోహదం చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.


ఐదునెలల్లో దిగుబడి..

రొయ్యల్లో రెండు రకాలు ఉంటాయి. ఉప్పునీటిలో పెరిగే రొయ్యలు(టైగర్ రొయ్యలు), మరో రకం మంచినీటిలో పెరిగే రొయ్యలు. వాటిలో మంచినీటి రొయ్యల పెంపకానికి జిల్లా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఈ పిల్లలు చెరువులో పోసిన ఐదు నెలల్లో విక్రయానికి అనువుగా పెరుగుతాయి. మార్కెట్‌లో వాటి ధర కిలో రూ.300కు పైగా ఉంటుంది. వీటి విక్రయం ద్వారా మత్స్య పారిశ్రామక సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశం ఉంటుంది.

చేప పిల్లలూ సగమే..

మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 2016 – 17 సంవత్సరం నుంచి ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. చేపలు పెరిగిన తర్వాత పట్టేందుకు వలలు, రవాణా చేసేందుకు ద్విచక్ర వాహనాలను కూడా సబ్సిడీపై అందించింది. జిల్లాలో 734 చెరువులు, మూడు జలాశయాలు ఉండగా గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 1.76 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశారు. అయితే ఈ ఏడాది 86 లక్షల పిల్లలను మాత్రమే విడుదల చేయగా.. అందులోనూ తీవ్ర జాప్యం జరిగింది. కొన్ని చెరువుల్లో నవంబర్‌లో సైతం చేప పిల్లలు పోశారు. మార్చి, ఏప్రిల్ వరకు చెరువుల్లో నీరు ఎండిపోతుందని, ఇలా అయితే పిల్లలు ఎలా పెరుగుతాయని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. ఇది తమకు తీవ్ర నష్టం కలిగిస్తుందని వాపోతున్నారు.

రొయ్యల పంపిణీపై ఆదేశాలు రాలేదు..



జిల్లాలో గతేడాది 15 చెరువుల్లో 23 లక్షల రొయ్య పిల్లలను పంపిణీ చేశాం. ఈ ఏడాది కూడా ప్రతిపాదనలు పంపించినా ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. – ఎండీ.ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, జిల్లా మత్స్యశాఖ అధికారి

విద్యార్థులపై శ్రద్ధ చూపండి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి భానుమతి



రామవరంలో ఆహారాన్ని పరిశీలిస్తున్న భానుమతి

కొత్తగూడెంఅర్బన్/అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, మంచి భోజనం అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. అన్నపురెడ్డిపల్లి సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ గురుకుల పాఠశాలలతో పాటు కొత్తగూడెం రామవరంలోని ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్లను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఆహారం కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. హాస్టళ్లలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణ పాటించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అంతకుముందు అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. ఆమె వెంట డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, ప్రిన్స్‌పాళ్లు ఎస్.చైతన్య, రాధాకృష్ణమూర్తి, ఎస్వో బురాన్ పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతుల్లో ఆశలు

ఈ నెల 30న విడుదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం

- గతంలో మూడుమార్లు చేసినా లక్షల్లో రైతుల ఎదురుచూపులు
- కుటుంబ నిర్ధారణ సర్వే చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చిన అధికారులు
- తాజాగా ప్రభుత్వ ప్రకటనతో మళ్లీ తెరపైకి రుణమాఫీ

రుణమాఫీపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో మూడు విడతలుగా రుణమాఫీ చేసినా మిగిలిపోయిన అర్హులకు రైతు పండుగలో భాగంగా ఈ నెల 30వ తేదీన నగదు విడుదల చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా ప్రకటించారు. దీంతో అర్హులై ఉండి మూడు నెలలకు పైగా ఎదురుచూస్తున్న రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి జరగనుందని అంచనా.. – ఖమ్మంవ్యవసాయం



ఎన్నికలకు ముందు హామీ

కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయాన రూ.2 లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. అనుకున్నట్లుగానే అధికారంలోకి రావడంతో జూలై 15న రుణమాఫీ మార్గదర్శకాలను విడుదల చేసి ఆగస్టు 15 నాటికి ప్రక్రియ పూర్తిచేస్తామని ప్రకటించింది. రూ.2లక్షల లోపు పంట రుణాలు కలిగిన అర్హులైన రైతులకు మూడు విడతల్లో రుణమాఫీ చేయనున్నట్లు వెల్లడిస్తూ తొలుత రేషన్ కార్డును ప్రామాణికం చేశారు. ప్రభుత్వం ఏళ్లుగా కార్డులను జారీ చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. దీంతో సర్వే ద్వారా అర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. రైతుభరోసా పేరిట పోర్టల్‌ను ఏర్పాటు చేయగా, అధికారులు కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియ చేపట్టారు. ఆపై రుణమాఫీకి అర్హులను గుర్తించి నివేదికలు సమర్పించారు.

మరో 2లక్షల మందికి అవకాశం

రైతు పండుగలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన రైతులకు రుణమాఫీ నగదు జమ చేస్తామని ప్రకటించింది. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 2లక్షల మందికి లబ్ధి జరిగే అవకాశముందని వ్యవసాయ, బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. అధికారుల అంచనా మేరకు ఖమ్మం జిల్లాలో 1.70 లక్షల మందికి భద్రాద్రి జిల్లాలో 25వేల నుంచి 30 వేల మంది రైతుల రుణమాఫీకి అవకాశం ఉన్నట్లు అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది.

జిల్లాల వారీగా రుణమాఫీ వివరాలు

విడత	ఖమ్మం జిల్లా		భద్రాద్రి జిల్లా	
	రైతుల సంఖ్య	రుణమాఫీ (రూ.కోట్లలో)	రైతుల సంఖ్య	రుణమాఫీ (రూ.కోట్లలో)
మొదటి	57,857	264.22	28,450	134.41
రెండో	33,942	262.50	16,889	143.05
మూడో	23,546	245.85	11,566	127.27
మొత్తం	1,15,345	772.57	56,905	404.73

పెద్ద సంఖ్యలో మిగిలిన రైతులు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇంకా పెద్దసంఖ్యలో రైతులకు రుణ మాఫీ కావాల్సి ఉంది. ప్రభుత్వం 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 నాటికి తీసుకున్న రూ.2లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఖమ్మం జిల్లాలో 3.75 లక్షల మంది రైతులు రూ.2,400 కోట్ల మేర, భద్రాద్రి జిల్లాలో 1.70 లక్షల మంది రైతులు రూ.వెయ్యి కోట్ల వరకు రుణాలు తీసుకున్నారు. ఇందులో మూడు విడతలు కలిపి మూడో వంతు రైతులకు మాత్రమే రుణమాఫీ నగదు జమ అయింది. ఖమ్మం జిల్లాలో 1,15,345 మంది రైతులకు సుమారు రూ.772.57 కోట్లు, భద్రాద్రి జిల్లాలో 56,905 మంది రైతులకు సుమారు రూ. 404.73 కోట్లు రుణమాఫీ అయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా

కార్మికుల ప్రతిమలు ఆవిష్కరణ



సింగరేణి కార్మికుల ప్రతిమల వద్ద ఎమ్మెల్యే కోరం, జీఎం ఆనంద్

ఇల్లెందు: పట్టణంలోని కరెంటాఫీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సింగరేణి కార్మికుల ప్రతిమలను గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహాలను పట్టణంలోని 21 ఇంక్లైన్ మైన్ నుంచి పట్టణానికి ముఖద్వారం లాంటి కరెంటాఫీస్ సెంటర్‌కు మార్చినట్లు తెలిపారు. అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, జీవీ మోహన్‌రావు, రవికుమార్, కార్మిక నాయకులు బాలాజీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి శివనాయక్

దుమ్ముగూడెం : రైతులు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్ సూచించారు. గురువారం పెద్దనల్లబల్లి రైతు వేదికలో నిర్వహించిన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఉచిత న్యాయ సేవ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎటువంటి సమస్యలున్నా రైతులు పారా లీగల్ వలంటీర్ ద్వారా సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సతీష్, తిరుమలరావు, పేరాల నాగరాజు, కె మహేశ్వరావు, శారద, సంధ్య, పొన్నాల కవిత, పిలక రమణారెడ్డి, జి.రమేష్, ఏఓ విజయ భాస్కర్ రెడ్డి, ఏఓ లావణ్య, ఏఈఓలు హసినా, ప్రవీణ్, సాహిత్య, వినీల, సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ గణేష్ పాల్గొన్నారు.

ఏపీజీవీబీలో తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణ

ఖమ్మంగాంధీచౌక్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు(ఏపీజీవీబీ)లో కొన్నేళ్లుగా రోజువారి వేతనాలతో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించారు. తెలుగు రాష్ట్రాల్లోని 776 ఏపీజీవీబీ శాఖల్లో 456 మందిని రెగ్యులర్ చేస్తూ బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారని ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు బ్యాంకు ఖమ్మం రిజియన్ పరిధిలో పలువురికి జాబితాలో స్థానం దక్కగా, వీరిలో కొందరిని ఇతర శాఖలకు బదిలీ చేసినట్లు సమాచారం. కాగా, గ్రామీణ బ్యాంకు అధికారులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యానతాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేపడుతుండగా ఎట్టకేలకు వారి కల ఫలించింది.

శిశు విక్రయం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీకి చెందిన ఓ మహిళకు పుట్టిన శిశువును ఓ వ్యక్తి ఖమ్మంలో రూ.మూడు లక్షలకు విక్రయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు ఖమ్మం వెళ్లి శిశువును తిరిగి కొత్తగూడేనికి తీసుకొచ్చి తల్లికి అప్పగించారు. శిశువును విక్రయించిన వారిపై కేసు నమోదు చేస్తామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లెనినా తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పినపాక: మండల పరిధిలోని గోపాలరావుపేట గ్రామవాసి వల్లపు సంపత్‌కు చెందిన పాడి గేదె బుధవారం అర్ధరాత్రి సమయంలో పొలంలో విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. సుమారు రూ. 50 వేల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

గృహోపకరణాలు దగ్ధం

పాల్వంచరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన ధరావత్ రాము ఇంట్లో గురువారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో ఇంట్లోని ఫ్రిజ్, ఫ్యాన్, టీవీ పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ. 50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాల్వంచరూరల్: అటవీ ప్రాంతంలో రహస్యంగా పేకాట ఆడుతున్నవారిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామ సమీపంలో ఉన్న జామాయిల్ తోటలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. 8 మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. రూ.32 వేల నగదు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

బొగ్గు ఉత్పత్తికి సహకరించాలి

- గుర్తింపు కార్మిక సంఘాన్ని కోరిన సింగరేణి అధికారులు
- పలు సమస్యలు లేవనెత్తగా పరిష్కారానికి ఆమోదం తెలిపిన యాజమాన్యం



సమావేశానికి హాజరైన సింగరేణి అధికారులు, యూనియన్ ప్రతినిధులు

సింగరేణి(కొత్తగూడెం): ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు గతంలో మాదిరిగా గుర్తింపు కార్మిక సంఘంతోపాటు ఇతర కార్మిక సంఘాలు సహకరించాలని సింగరేణి డైరెక్టర్లు కోరారు. గురువారం కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో గుర్తింపు కార్మిక సంఘంతో 50వ నిర్మాణాత్మక సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (పీఅండ్‌పీ) వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపులో కార్మికుల సంఘాల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

ఏమేమీ చర్చించారంటే..

కార్మికులందరికీ కొత్త ఇన్సెంటివ్ పాలసీ ప్రవేశపెట్టాలి. ప్లే డే, పీహెచ్‌డీలలో ఎన్–1 పాలసీ రద్దు చేయాలి. 2000 ర్యాంకుతో సంబంధం లేకుండా ప్రస్తుత మెరిట్ స్కాలర్‌షిప్ 57 స్లాట్‌లకు చెల్లించాలి. మెరిట్ స్కాలర్‌షిప్‌ను రూ. 50 వేలకు పెంచాలి. రామగుండంలోని మెడికల్ కళాశాలలో సింగరేణియన్లకు 25 శాతం ఎంబీబీఎస్ సీట్లు రిజర్వు చేయాలి. కార్పొరేట్ మెడికల్ బోర్డ్ ద్వారా అండర్ గ్రౌండ్‌కు అనర్హులుగా ప్రకటించిన మైనింగ్ సిబ్బంది, ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలి. తొలగించిన జేఏఈటీలను పునరుద్ధరించాలి. ప్రైవేటు ఏజెన్సీలకు బదులుగా సింగరేణిలోని అన్ని క్యాంటీన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు యాజమాన్యమే అందించాలి. కాంట్రాక్ట్/ ఔట్ సోర్సింగ్ కార్మికులకు క్యాంటీన్ సౌకర్యం కల్పించాలి. కేడర్‌స్కీమ్, ప్రమోషన్ పాలసీలో సర్వే, స్టాఫ్, కెమిస్టులు, ఫారెస్ట్, పారా మెడికల్ స్టాఫ్ వర్క్ షాపు ఉద్యోగులకు, ఈపీ ఆపరేటర్లు, గ్రేడ్ డీ నుంచి సీకి, సీ నుంచి గ్రేడ్ బీకి సమయానుకూల ప్రమోషన్లు ఇవ్వాలి. పెండింగ్‌లో ఉన్న అన్ని డిపెండెంట్ ఉద్యోగుల కేసులతో సహా విజిలెన్స్ కేసులలో జప్తు చేసిన మొత్తాన్ని సమీక్షించి క్లియర్ చేయాలి. మెషిన్ మైనింగ్ విభాగాలకు ట్రేడ్స్‌మన్ హెల్పర్లను కేటాయించాలి. యూజీ పనిలో ట్రేడ్స్‌మెన్స్‌కు అధికార ప్రతినిధిని కేటాయించాలి. పై సమస్యలను స్ట్రక్చరల్ సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం లేవనెత్తగా యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, వివిధ విభాగాల జీఎంలు, అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభం



పామాయిల్ తోటలో డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి కిషోర్

అశ్వారావుపేటరూరల్: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తే లాభం పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి కిషోర్ అన్నారు. గురువారం మండలంలోని వినాయకపురం, వినాయకపురం కాలనీ, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లోని పామాయిల్ తోటలను సందర్శించారు. డ్రిప్ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటలను సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, ఇతర రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల పాటు అంతర పంటలను సాగు చేస్తూ, ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. భవిష్యత్‌లో పామాయిల్ టన్ను ధర మరింత పెరిగే అవకాశంఉందని, ప్రస్తుతం టన్ను ధర రూ.19,144 ఉందని వివరించారు. అనంతరం నారంవారిగూడెం వద్దగల ఆయిల్‌ఫెడ్ నర్సరీని సందర్శించారు.

విధివిధానాలు రూపొందించాలి



జీటీపీఎస్ సీఈకి వినతిపత్రం ఇస్తున్న ఇంజనీర్లు

మణుగూరు రూరల్: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఇంజనీర్ల బదిలీలపై విధివిధానాలు రూపొందించాలని ఇంజనీర్స్ అసోసియేషన్ల నాయకులు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ప్లాంట్ సీఈ బి.బిచ్చన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఈఏ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి బి.రవిప్రసాద్, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి సీహెచ్ రవితేజ మాట్లాడుతూ ఇటీవల లోపాయికారిగా జరిగిన బదిలీలను రద్దు చేయాలని కోరారు. రామగుండం ప్లాంట్‌ను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, సాయిరాం, రాము, రమణ, రషీద్ అహ్మద్, వెంకటేషన్, మహిళా ప్రతినిధి అల్తాఫ ఉన్నిసా తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు

సాక్షి ఎఫెక్ట్..



కార్మికులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలోకి కార్మికులెవరూ మద్యం తాగి రాకుండా బ్రీత్ ఎనలైజర్ యంత్రంతో పరీక్షలు చేస్తున్నారు. 'భద్రత చర్యలు కరువు'శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 13న ప్రచురితమైన కథనానికి యాజమాన్యం స్పందించింది. ఈ నెల 14న కార్మికులందరికీ హెల్మెట్లను పంపిణీ చేసి విధిగా ధరించాలని ఆదేశించింది. ఇప్పుడు ఎవరూ మద్యం తాగి రాకుండా కార్మికులతోపాటు లారీ, ట్రాక్టర్ డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్‌తో గురువారం నుంచి పరీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ మాట్లాడుతూ ఫ్యాక్టరీలో మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నిరోధించడానికి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు ప్రారంభించామని తెలిపారు. మద్యం తాగిన కార్మికులను ఫ్యాక్టరీలోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని వెల్లడించారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. గురువారం కొత్తగూడెం సింగరేణి ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సంబురాలు ప్రతిభా పరీక్ష, క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల నుంచి 60 టీమ్‌లుగా 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రశ్నాపత్రాలను ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, మండల విద్యాధికారి ప్రభుదయాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దన్నారు. నిర్దిష్ట లక్ష్యం ఎంచుకుని సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వీరభద్రం, రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు ఏ.కస్తూరి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి లక్ష్మణ్, జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, గౌరవాధ్యక్షులు మండవ సుబ్బారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ దస్తగిరి, కార్యదర్శి మోహన్‌రావు పాల్గొన్నారు.

రెండు క్వింటాళ్ల గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంఅర్బన్: కారులో తరలిస్తున్న గంజాయిని భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ గణేష్ కథనం ప్రకారం.. ఎక్సైజ్ అధికారులు పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ కారు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేశారు. దీంతో కారు ఫేక్ నంబర్‌తో వెళ్తున్నట్లు తేలింది. వాహనంలో 2.10 క్వింటాళ్ల గంజాయి తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న, మహారాష్ట్రకు చెందిన పండరీనాథ్, దత్తాత్రేయలను అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారయ్యాడు. అధికారులు విచారించగా ఏపీలోని డొంకరాయిలో గంజాయి కొని పుణేకు తరలిస్తున్నట్లు తేలింది. కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.56 లక్షల వరకు ఉంటుందని ఏసీ గణేష్ తెలిపారు. ఎక్సైజ్ ఈఎస్ జానయ్య, సీఐ రహీమున్నిసా బేగం, ఎస్‌ఐ అల్లూరి సీతారామరాజు పాల్గొన్నారు.

టేకులపల్లిలో 9 కేజీలు..

టేకులపల్లి: మండలం పరిధిలోని కారుకొండ క్రాస్ రోడ్ వద్ద గురువారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో తిరుమలగిరి, కొడకండ్ల గ్రామాలకు చెందిన మద్దూరి ఉదయ్ కిరణ్, కోమటి భాస్కర్ ద్విచక్ర వాహనంపై 9 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల చేత పంచనామా నిర్వహించారు. బైక్, గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు.

3న ఇంటర్వ్యూలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో గైనకాలజిస్టు పోస్టు భర్తీకి వచ్చే నెల 3న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తికలిగిన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో అర్హతలు, సీనియారిటీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. నెలకు రూ.2 లక్షల చొప్పున వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



టీమ్ ఇండియా స్టార్ బ్యాట్స్‌మెన్ తిలక్ వర్మతో గురువిద్వాన్

భద్రాచలంటౌన్ : అండర్ –16 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు భద్రాచలానికి చెందిన సిద్దాంతపు నాగరాజు–జెన్నీ దంపతుల కుమారుడు గురువిద్వాన్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఈనెల 27న 15 మందితో కూడిన రాష్ట్ర జట్టును ప్రకటించగా అందులో గురువిద్వాన్‌కు చోటు లభించింది. డిసెంబర్ 6న లక్నోలో జరిగే అండర్ – 16 విజయ్ మెర్చంట్ ట్రోఫీలో పాల్గొనేందుకు గురువిద్వాన్ వెళ్లనున్నాడు. కాగా, పట్టణంలోని క్రీడాకారులతో పాటు క్రీడాభిమానులు బాలుడిని అభినందించారు.

రేషన్ బియ్యం సీజ్



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం వాహనం, నిందితులు

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ వాహనాన్ని గురువారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం .. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామం నుంచి కాకినాడకు ట్రాలీ వాహనంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. తెల్లవారుజామున అశ్వారావుపేట రింగ్‌రోడ్ సెంటర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది తనిఖీ చేసి పట్టుకున్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితులు, పిండిప్రోలు గ్రామానికి చెందిన మడికంటి రాము, లింగస్వామితోపాటు బియ్యం కొనుగోలు చేస్తున్న కాకినాడ వ్యాపారి మణికంఠపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్(37) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన ఖమ్మంలోని తన సోదరుడి వద్ద ఉండగా గురువారం ఉదయం ఆకస్మాత్తుగా వాంతులు చేసుకుంటూ కుప్పకూలాడు. దీంతో ఆస్పత్రికి తరలించే క్రమాన మార్గమధ్యలోనే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని నాగులవంచకు తరలించగా ప్రధానోపాధ్యాయుడు బండి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మేరీ క్రిస్టియానా, చంద్రశేఖర్, రవీందర్, కామేశ్వరరావు, షఫీ, నిర్మల్‌కుమార్, కృష్ణానాయక్, శోభన్, శ్రీనివాస్, రజిత తదితరులు నివాళులర్పించారు. అలాగే, అంత్యక్రియల నిమిత్తం శ్రీనివాస్ తల్లిదండ్రులకు రూ.20వేల నగదు అందజేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు...

తల్లాడ: మండలంలోని కొత్త నారాయణపురం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తల్లాడ వైపు నుంచి బిల్లుపాడు వెళ్తున్న వరిగడ్డి ట్రాక్టర్‌ను సత్తుపల్లి నుండి తల్లాడ వైపు అతి వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై కూర్చున్న షేక్ మీరా(37)కు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఇదే ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న బిల్లుపాడుకు చెందిన చీమకుర్తి వెంకన్న, కాళంగి కాంతారావు సైతం గాయపడ్డారు. ఈమేరకు పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

పీఎల్‌జీఏ వారోత్సవాలు నిర్వహించాలి

చర్ల: డిసెంబర్ 2 నుంచి 8 వరకు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వారోత్సవాలను గ్రామాల్లో నిర్వహించాలని మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక లేఖ విడుదల చేశారు. పాలకులు తలపెట్టిన కగార్ యుద్ధాన్ని తిప్పికొట్టాలని కోరారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో 8 లక్షల మంది సాయుధ బలగాలను మోహరింపజేశారని, నిత్యం కూంబింగ్ ఆపరేషన్‌లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ గ్రామాలను చుట్టుముట్టి అమాయకులను చంపుతూ సంబరాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

డిస్కంల దివాలా బాట!

- తీవ్ర ఆర్థిక నష్టాల్లో దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలు
- 2022–23 నాటికే రూ.6,76,681 కోట్లకు చేరిన నష్టాలు
- తెలంగాణలోని రెండు డిస్కంల నష్టాలు రూ.60,922 కోట్లు
- నష్టాల్లో దేశంలోనే ఐదో స్థానంలో తెలంగాణ డిస్కంలు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఏటేటా నష్టాల్లో కూరుకుపోతున్నాయి. అత్యధిక నష్టాలున్న డిస్కంలు కలిగిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ దేశంలోనే ఐదో స్థానంలో ఉన్నది. దేశంలో ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని డిస్కంలకు కలిపి 2015–16లో రూ.3,74,099 కోట్ల నష్టాలు ఉండగా.. 2022–23 నాటికి అవి రూ.6,76,681 కోట్లకు పెరిగాయి. ఇదే కాలంలో తెలంగాణ డిస్కంల నష్టాలు రూ.16,520 కోట్ల నుంచి రూ.60,922 కోట్లకు ఎగబాకాయి. రాజ్యసభలో ఎంపీ సంజయ్‌కుమార్ ఝా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలు వెల్లడించింది. ప్రభుత్వరంగ డిస్కంల నష్టాల్లో రూ.1,62,507 కోట్లతో తమిళనాడు దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. రూ.92,070 కోట్ల నష్టాలతో రాజస్థాన్, రూ.91,632 కోట్ల నష్టాలతో ఉత్తరప్రదేశ్, రూ.64,843 కోట్ల నష్టాలతో మధ్యప్రదేశ్ వరుసగా 2,3,4 స్థానాల్లో ఉన్నాయి.

లాభాల్లో ప్రైవేటు.. నష్టాల్లో సర్కారీ సంస్థలు

దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల్లో కూరుకుపోయి దివాలా అంచున నిలువగా, ప్రైవేటు రంగ డిస్కంలు మాత్రం లాభాల్లో దూసుకుపోతున్నాయి. 2015–16 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు రంగ డిస్కంల లాభాలు రూ.12,146 కోట్లు ఉండగా.. 2022–23 నాటికి రూ.23,116 కోట్లకు పెరిగాయి. ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో మొత్తం 12 ప్రైవేటు డిస్కంలు ఉండగా, అవన్నీ లాభాల్లోనే నడుస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో 42 డిస్కంలు ఉండగా.. గుజరాత్‌లోని మూడు, కర్ణాటక, పశ్చిమబెంగాల్‌లో ఒక్కో డిస్కం కలిపి మొత్తం ఐదు మాత్రమే లాభాల్లో ఉన్నాయి. మిగిలిన 37 ప్రభుత్వ రంగ డిస్కంలు నష్టాల్లో కూరుకుపోయాయి.

మోయలేని అప్పుల్లో దక్షిణ తెలంగాణ డిస్కం


తెలంగాణలో రెండు ప్రభుత్వ రంగ డిస్కంలున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) నష్టాలు 2015–16లో రూ.10,625 కోట్లు ఉండగా, 2022–23 నాటికి రూ.42,330 కోట్లకు చేరాయి. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) నష్టాలు ఇదే కాలంలో రూ.5,895 కోట్ల నుంచి 2022–23 నాటికి రూ.18,592 కోట్లకు పెరిగాయి.

భారీగా పెరిగిన అప్పులు

దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ డిస్కంల అప్పులు 2015–16లో రూ.4,08,941 కోట్లు ఉండగా, 2022–23 నాటికి రూ.6,61,263 కోట్లకు పెరిగాయి. ఇదేకాలంలో తెలంగాణ డిస్కంల అప్పుల రూ.13,944 కోట్ల నుంచి రూ.35,883 కోట్లకు పెరిగాయి.

దేశంలోని డిస్కంల పరిస్థితి

- మొత్తం ప్రభుత్వరంగ డిస్కంలు 42
- నష్టాల్లో ఉన్న ప్రభుత్వరంగ డిస్కంలు 37
- 2022–23 నాటికి సర్కారు డిస్కంల నష్టాలు రూ.6,76,681
- లాభాల్లో ఉన్నవి 5
- దేశంలో మొత్తం ప్రైవేటు డిస్కంలు 12
- లాభాల్లో ఉన్న ప్రైవేటు డిస్కంలు 12



కలెక్టర్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు.. క్షమాపణ చెప్పాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించాయి. సిరిసిల్ల కలెక్టర్‌ను 'సన్నాసి.. కాంగ్రెస్ కార్యకర్త'.. అంటూ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఒక సభలో వ్యాఖ్యానించడం తెలిసిందే. పాలనా విధానాలు, రాజ్యాంగ నిబద్ధత ఆధారంగా సివిల్ సర్వెంట్లు నిర్వర్తించే బాధ్యతలకు విరుద్ధంగా కేటీఆర్ వ్యాఖ్యలున్నాయని వారు మండిపడ్డారు. ప్రజాసేవలో అధికారి విధులను నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా, ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్వహించాల్సి ఉంటుందని సంఘాలు గుర్తు చేశాయి. కానీ ఊహించని ఇటువంటి నిరాధార ఆరోపణలు బాధ్యతారాహిత్యమైనవని, ప్రజాస్వామ్య వ్యవస్థలపై చెడు ప్రభావాన్ని చూపిస్తాయని తెలిపాయి. సిరిసిల్ల కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ పూర్తి మద్దతు తెలియజేస్తుందని ఐపీఎస్ అధికారుల సంఘం పేర్కొంది. సివిల్ సర్వీసు అధికారుల గౌరవం, స్వతంత్రత, నిష్పక్షపాతత్వాన్ని కాపాడేందుకు అండగా నిలబడతామని స్పష్టం చేసింది.

సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న సీఎం

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వివరాలను నమోదు చేయించుకు న్నారు. గురువారం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–44లోని సీఎం నివాసానికి వెళ్లిన ఎన్యుమరేటర్లు ఆయన వివరాలను నమోదు చేశారు. వారితో పాటు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సర్వే పురోగతిపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని ఆరా తీశారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వైద్యారోగ్య శాఖకు సీఎం అధిక ప్రాధాన్యం

వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వైద్యారోగ్యశాఖ పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు ప్రభుత్వం తెలిపింది. భారీగా నిధుల కేటాయింపుతో పాటు ఆరోగ్యశాఖలో నియామకాలపైనా దృష్టి సారించి తదనుగుణంగా కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొంది. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రెండింతలు చేసిన ముఖ్యమంత్రి.. తొలి ఏడాదిలోనే వైద్యారోగ్య శాఖలో నియామకాలు జరపడంతో పాటు నూతన వైద్య, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల మంజూరు, సీట్లు, పడకల పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రభుత్వం వివరించింది. దేశంలో తొలిసారిగా ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల జారీకి పైలెట్ ప్రాజెక్టు చేపట్టిన విషయాన్ని ప్రభుత్వం వివరించింది. ఈ కార్డులతో రాష్ట్ర హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, రోగి వివరాలన్నీ హెల్త్ ప్రొఫైల్‌లో పొందుపరచనున్నట్లు వెల్లడించింది.

ఏడాది కాలంలో వైద్యారోగ్యశాఖలో చేపట్టిన కార్యక్రమాలపై ప్రభుత్వ వివరాలు సాక్షి ప్లస్ (ఈ పేపర్)లో

విద్యార్థుల ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే వేటే..

▶ మొదటి పేజీ తరువాయి

ఏమాత్రం ఏమరుపాటుగా ఉండవద్దని స్పష్టం చేశారు. ఏమాత్రం నిర్లక్ష్యం ఉన్నట్లు తేలినా సదరు అధికారులు, సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

తరచూ తనిఖీలు చేయండి

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అందించే విషయంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వొద్దని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై ఇదివరకే పలుమార్లు సమీక్షించానని గుర్తు చేశారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు తరచూ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. ఈ మేరకు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్రతిష్టపాలు చేసేందుకు కొందరి యత్నాలు

విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని.. పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాము ఇలా సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నా.. కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ప్రకటించారు. వసతి గృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా వదంతులు సృష్టిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఆహార నాణ్యతపై టాస్క్‌ఫోర్స్!

మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: విద్యా సంస్థలు, హాస్టళ్లు, ఆస్పత్రుల్లో పంపిణీ చేస్తున్న ఆహారం నాణ్యత పట్ల కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మొదలు... సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు, వసతిగృహాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాల యాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభు త్వ వైద్య కళాశాలల్లో అందించే ఆహారం నాణ్య తపై నిఘా, పర్యవేక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ కమి టీని ఏర్పాటు చేసింది. ఎస్సీ అభివృద్ధి శాఖతోపాటు గిరిజన, బీసీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖలు, వైద్యారోగ్య శాఖ పరిధి లోకి వచ్చే అన్ని విద్యా సంస్థల్లో అందించే ఆహా రం నాణ్యతను పర్యవేక్షించే బాధ్యతను ఈ కమి టీకి అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో సభ్యులుగా ఫుడ్ సేఫ్టీ కమిషనర్ లేదా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, సంబంధిత విద్యా సంస్థ ఉన్నతాధికారి/ అదనపు సంచాలకుడు, విద్యా సంస్థ జిల్లా స్థాయి అధికారి (డీఎస్‌డబ్ల్యూఓ/ డీటీడబ్ల్యూఓ/డీబీసీడబ్ల్యూఓ/ డీఈఓ) తదితరులుంటారు. ఈ కమిటీ నిర్దేశించిన విద్యా సంస్థలను సందర్శించి ఆహార భద్రత చర్యలను పరి శీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏదైనా సంస్థలో లోటుపాట్లను గుర్తిస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు బాధ్యులపై చర్యల కోసం సిఫార్సు చేయాలని సూచించింది.



విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ మల్హర్ మండలం మల్లారం కస్తూర్బా గాంధీ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, నిత్యావసర సరకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి అల్పాహారం, భోజన సదుపాయాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ఆహార నాణ్యత పరిశీలనకు ప్రతీ శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీవోలు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విద్యా సంస్థల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలు, పర్యవేక్షక అధికారి

టాస్క్‌ఫోర్స్ మాత్రమేకాకుండా విద్యా సంస్థల స్థాయిలో ఫుడ్ సేఫ్టీ కమిటీలను, పర్యవేక్షక అధికారిని సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటికి సంబంధించిన మార్గదర్శ కాలను జారీ చేసింది. విద్యా సంస్థల్లో మెరుగైన, బలవర్ధకమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. కలుషిత ఆహారంతో కలిగే అనా రోగ్య సమస్యలు, తదుపరి పరిణామాల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ కమిటీలు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

- ఫుడ్ సేఫ్టీ కమిటీలో విద్యా సంస్థ ప్రధానోపాధ్యాయుడు/ ప్రిన్సిపల్/ వార్డెన్‌తోపాటు మరో ఇద్దరు సిబ్బంది సభ్యులుగా ఉంటారు.
- ఈ కమిటీ సభ్యులు ప్రతిరోజు భోజనం తయారు చేసే ముందు స్టోర్ రూమ్, వంట గదిని తనిఖీ చేయాలి. తర్వాత వంటగది నిబంధనలకు అనుగుణంగా నాణ్యత, ప్రమాణాలు పాటిస్తున్నట్టు నిర్ధారించాలి.
- వంట వండిన తర్వాత ఆహార నాణ్యతను కమిటీ సభ్యులు రుచి చూసి పరిశీలించిన తర్వాతే విద్యార్థు లకు అందించాలి. ప్రతిరోజు ఈ బాధ్యతలను విధిగా పూర్తి చేయాలి.
- త్వరలో నోడల్ డిపార్టుమెంట్ యాప్‌ను తయారు చేస్తుంది. అప్పటి నుంచి తనిఖీలకు సంబంధించిన ఫోటోలను, ఇతర సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- ఇక జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి విద్యాసంస్థకు ప్రత్యేకంగా ఒక పర్యవేక్షక అధికారికి నియమిస్తారు. ఈ పర్యవేక్షక అధికారి ప్రతిరోజు భోజనం వండే ముందు, తర్వాత తనిఖీ చేస్తారు. అక్కడి పరిస్థితిని చిత్రాలు తీసి జిల్లా కలెక్టర్/ సంబంధిత ఉన్నతాధికారికి సమర్పిస్తారు.
- వీటన్నింటికి సంబంధించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

జిల్లా వార్తలు

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

గిరిజన గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీఓ నాగార్జునరావు, అధికారులు

మణుగూరు రూరల్: ఉపాధ్యాయులు మెరుగైన బోధన ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని గిరిజన గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు సూచించారు. మణుగూరు మండలం గుట్టమల్లారంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, కళాశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాల పరిసరాలు, విద్యార్థుల వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను తనిఖీ చేసిన ఆర్‌సీఓ మెనూ ఆధారంగా మధ్యాహ్న భోజనం అమలవుతోందా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై బోధన చేయాలని, వారి సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. తరగతి గదిలోకి సెల్‌ఫోన్లు తీసుకురావొద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాకాసి గూళ్లను సందర్శించిన అధికారులు



పురాతన రాకాసి గూళ్లను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని మనుబోతులగూడెం గ్రామపంచాయతీ పరిధి వేములూరులో పురాతన రాకాసి గూళ్లను అధికారులు గురువారం పరిశీలించారు. 'పురాతన రాకాసి గూళ్లు!' శీర్షికన ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్న అంశంపై బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కలెక్టర్ కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గ్రామాన్ని సందర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు పురాతనమైన రాకాసి గూళ్లను పరిశీలించిన వివిధ శాఖల అధికారులు వివరాలతో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. సెర్ప్ డీపీఎం రంగారావు, ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఎం సత్యనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ సీతారాములు, టీఏలు వెంకటేష్, కాంతారావు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యమే కీలకం

- మామిడిలో పూమొగ్గలను ఉత్తేజపర్చాలి
- మిగతా పంటల్లోనూ సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ
- ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్ సూచనలు



కూసుమంచి మండలంలోని జామ తోటలో పరిశీలిస్తున్న అధికారులు



ఆయిల్‌పామ్ తోటలో పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ తదితరులు

ఖమ్మంవ్యవసాయం: పంటల్లో రైతులు చేపట్టే యాజమాన్య పద్ధతులపై దిగుబడులు ఆధారపడి ఉంటాయని ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. జిల్లాలోని పలు మండలాల్లో ఉద్యాన పంటల సాగును ఆయన పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా పంటల యాజమాన్యం, ఆయా పంటలకు ఆశించిన తెగుళ్లు, రైతులు చేపడుతున్న సస్యరక్షణ చర్యలను తెలుసుకుంటూ అవసరమైన సూచనలు ఇస్తున్నారు. మామిడి, ఆయిల్ పామ్ పంటల సాగులో ప్రస్తుత తరుణాన తీసుకోవాల్సిన మెళకువలు, తెగుళ్ల నివారణకు పాటించవలసిన చర్యలపై ఆయన ఇచ్చిన సూచనలు ఇలా ఉన్నాయి.

మామిడి

ఖమ్మం జిల్లాలో 32,105 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. మామిడిలో పూమొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూత తెప్పించాల్సిన సమయమిది. ఇందు కోసం ఆడపూల శాతం పెంచడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రా., బోరాన్ 2 గ్రా.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మామిడిలో పూత రాక ముందు డిసెంబరులో తేనె మంచు పురుగులు చెట్ల మొదళ్లు, కొమ్మల బెరళ్లలో దాగి ఉంటాయి. పూత సమయానికి అవి చెట్టుపైకి ఎగబాకి పూగుత్తులను ఆశించి నష్టపరుస్తాయి. ఈ విషయాన్ని గుర్తించి తొలి దశలోనే తేనెమంచు పురుగులను నివారించేందుకు ఆసిఫేట్‌ను లీటరు నీటికి 1.5 గ్రా. లేదా క్లోరిపైరిపాస్‌ను లీటర్ నీటికి 2.5 మి.లీ. చొప్పున మరియు నువాన్ మందు లీటర్ నీటికి 0.5 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పూత ప్రారంభదశలో తేనె మంచు ఆశించే అవకాశం ఉంది. పూత ప్రారంభ దశలో ఉన్నప్పుడు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ.ను లీటర్ నీటికి లేదా థయోమిథాక్సాం 0.4 గ్రాములను లీటర్ నీటికి కలిపి, గంధకం 3 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తేతేనెమంచు పురుగు, బూడిద తెగులును అరికట్టవచ్చు. ఈ మందుల పిచికారీని రైతులు త్వరగా పూర్తిచేయాలని, లేకపోతే చీడలు పూతను నష్టపరిస్తే పిందెలు సరిగా ఏర్పడవు.

ఆయిల్ పామ్

ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు తగిన మెళకువలు పాటిస్తే అనేక ప్రయోజనాలను ఉంటాయి. ప్రధానంగా పంట సాగు సమయాన మొక్కలను ప్రణాళికాయుతంగా నాటాలి. త్రిభుజాకారం / చతురస్రాకార వ్యవస్థలో 9 మీటర్ల దూరంతో మొక్కలను నాటాలి. ప్రస్తుతం ఆయిల్‌పామ్ మొక్కలను మొవ్వకుళ్లు తెగులు ఆశిస్తోంది. దీని నివారణకు కార్బండజిమ్ ఒక గ్రా.ను లీటర్ నీటిలో(100–250 మి.లీ. ద్రావణం) కలిపి మువ్వులో పోయాలి. రైనోసిరాస్ బీటిల్‌ను నివారించడానికి 20 గ్రాముల నాఫ్తలిన్ బాల్‌లను చిల్లులు గల సాచెట్లలో ఉంచాలి. ఆయిల్‌పామ్ తోటల్లో అవసరానికి అనుగుణంగా 160 నుండి 250 లీటర్ల నీటిని రోజుకు ఒక చెట్టుకు అందించాలి. ఐదేళ్ల పైబడిన తోటల్లో ఎకరానికి 5 కిలోల యూరియా, 3కిలోల డీఏపీ మరియు 5కిలోల ఎంఓపీతో ఫలదీకరణం చేయాలి. లేదంటే ఎరువులు యూరియా 650 గ్రాములు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 940 గ్రాములు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 500 గ్రాములను ఒక చెట్టుకు వేయాలి. మూడేళ్ల వరకు లేత తోటల్లో ప్రత్యేక సాధనంతో ఆడ, మగ పూగుత్తలను తొలగించాలి. అయితే, ఆకులను కత్తిరించవద్దు, కట్టవద్దు.

నిమ్మ

నిమ్మ చెట్ల పాదుల చుట్టూ మల్చింగ్ చేయాలి. జిగ్‌జాగ్‌గా ఉన్న, ఎండిన కొమ్మలను తొలగించాలి. నేలమట్టం నుండి 2 అడుగుల ఎత్తు వరకు ప్రధాన మొదలుపై పక్క శాఖలు అభివృద్ధి చెందకుండా చూసుకోవాలి. పురుగుల నియంత్రణకు డైకోఫాల్ 3 మి.లీ.ను లీటర్ నీటికి లేదా వెట్టబుల్ సల్ఫర్ (80శాతం డబ్ల్యూపీ) 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఉద్యోగుల మానసికోల్లాసానికే వనభోజనాలు

ఆర్టీసీ ఖమ్మం ఆర్‌ఎం సరిరామ్‌నాయక్



ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్‌ఎం సరిరామ్‌నాయక్

మధిర: విధి నిర్వహణలో నిత్యం తలమునకలయ్యే ఆర్టీసీ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపేందుకు వన భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ నాయక్ తెలిపారు. గురువారం మధిర డిపో ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబాలకు వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం మాట్లాడుతూ కార్తీక మాసంలో వన భోజనాలు నిర్వహిస్తున్నా విధినిర్వహణలో ఉండే ఆర్టీసీ ఉద్యోగులు కుటుంబంతో హాజరుకాలేని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యాన ఆర్టీసీ కుటుంబమే సామాజికవర్గంగా వన భోజనాలకు రూపకల్పన చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేఎంపీఎల్‌లో ప్రథమ స్థానం సాధించిన డ్రైవర్ పేరయ్యతో పాటు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సన్మానించారు. అలాగే, వన సమారాధనలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం పవిత్ర, డిపో మేనేజర్ శంకర్‌రావు, ఉద్యోగులు టీసీఎస్.రెడ్డి, ఎంఆర్‌సీ.రావు, డి.వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల ఆరోగ్యంపై పట్టింపు లేదా?'

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటిస్తూ విద్యార్థులు అస్వస్థతకు గురైనా ప్రభుత్వంలో చలనం రావడం లేదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో విమర్శించారు. అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పిల్లల ప్రాణాలను గాలికి వదిలేస్తోందని పేర్కొన్నారు. ఒక్క మాగనూర్‌లోనే కాకుండా అనేక జిల్లాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాగడం లేదని తెలిపారు. ఈక్రమంలో విద్యార్థులు బయట పదార్థాలు తినడంతోనే అనారోగ్యం పాలయ్యారని అధికారులతో చెప్పించడం దుర్మార్గమని పేర్కొన్నారు. అంతేకాక ఆందోళనలు చేస్తున్న పీడీఎస్‌యూ, ఇతర సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు రంగారావు తెలిపారు.

అంతటా కాంట్రాక్టు కార్మికులే..



బెల్ట్‌పై పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

- అయినా దక్కని ప్రతిఫలం
- సింగరేణి యాజమాన్యం తీరుపై విమర్శలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న కార్మికులు, సంఘాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఇంతింతై వటుడింతై అన్న చందంగా కాంట్రాక్ట్ వ్యవస్థ విస్తరించింది. పర్మనెంట్ కార్మికులతో పోటీగా భూగర్భ గనులు, సర్ఫేస్ విభాగాల్లో వీరితో పని చేయిస్తున్నారు. ఇవి కాకుండా ఆర్సీ, ఐఆర్‌పీఎం, పీఎం, వెల్ఫేర్, ఫైనాన్స్, సివిల్ విభాగాల్లోనూ పని చేయిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్ ఏరియాలోని మెయిన్ ఆస్పత్రి, వర్క్‌షాపు, స్టోర్స్, ఎస్‌అండ్‌పీసీతోపాటు మరికొన్ని విభాగాల్లో 1000 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థ 2004లో ఇల్లెందు జేకే ఓసీ సివిల్ విభాగంలో 16 మందితో ప్రారంభం కాగా.. ప్రస్తుతం 56 విభాగాల్లో సుమారు 32 వేల మంది పనిచేస్తున్నారు. ఇంతవరకూ బాగానే వీరి వేతనాలు, ఇతర అంశాల్లో యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై పలువురు మండిపడుతున్నారు.

కాంట్రాక్టర్లకే కాసులు..

సింగరేణి సంస్థలో కాంట్రాక్టీకరణ విధానం మొదలైనప్పటి నుంచీ కాంట్రాక్టర్లకే కాసులు కురుస్తున్నాయి. గతంలో సింగరేణి వ్యాప్తంగా సుమారు 100 మంది ఉన్న కాంట్రాక్టర్ల సంఖ్య నేడు వేల మందికి చేరింది. అంతేకాకుండా గతంలో ఒక టెండర్‌లో 20 మంది కార్మికులు పనిచేస్తే ఇప్పుడు కొత్త వ్యక్తి టెండర్ పొందితే మరో నలుగురైదుగురు పెరుగుతున్నారు. వీరి వద్ద రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు కొంతమంది తీసుకుని పనిలో పెట్టుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా అధికారులు నోరు మెదపకపోవడంలో ఆంతర్యమేంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఒక సీనియర్ కార్మికుడు నెలంతా, రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తే రూ.50 నుంచి రూ.60 వేల వేతనం వస్తోంది. అదే కాంట్రాక్టర్లు ఏ పనీ చేయకుండానే కొన్ని టెండర్లలో రూ.లక్షకు పైగా దండుకుంటున్నట్లు సమాచారం.

సమస్యల పరిష్కారానికి ఆందోళనలు

విధులకు రాని కార్మికులకు జరిమానా విధిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విధానాన్ని రద్దు చేయడంతో పాటు బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు, సోలార్, సులభ్, నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా తదితర హక్కుల సాధనకు కార్మికులు ఉద్యమ బాట పట్టారు. ఇప్పటికే ఏరియాల వారీగా అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. డిసెంబర్ 1 నుండి 5వ తేదీ వరకు కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత 5 నుండి 10వ తేదీ వరకు జీఎం, పీఓ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టేందుకు కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి.

జరిమానా విధించడం సరికాదు

డ్యూటీకి రాని కార్మికుడికి నో వర్క్, నో పే విధానం అమలు చేయాల్సిన యాజమాన్యం పనికి రాని కాంట్రాక్ట్ కార్మికుడికి రెండు రోజుల వేతనం జరిమానా వేయటం సరికాదు. పర్మనెంట్ కార్మికులు నెలల కొద్దీ, సంవత్సరంలో 75 రోజులు పనిచేయకపోయినా.. వారిని బతిమిలాడి పని చేయిస్తున్న యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల ఇలా చేయడం సరికాదు. ఈ విధానం బ్రిటీష్ కాలంలో కూడా లేదు. దీన్ని వెంటనే రద్దు చేయాలి.

– యాకూబ్‌షావలీ, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

రామయ్య సన్నిధిలో యతిరాజ జీయర్..



నిత్యకల్యాణమూర్తుల వద్ద పూజలు చేస్తున్న స్వామిజీ

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని కర్ణాటకకు చెందిన 41వ యదుగిరి యతిరాజ నారాయణ జీయర్ మఠ స్వామిజీ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, వేదపండితులు, ఈఓ రమాదేవి ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అనంతరం బేడా మండపంలో భక్తులకు ప్రవచనం అందజేశారు.